క్లుప్తంగా

దంత సంరక్షణతో మెరుగైన ఆరోగ్యం



మాట్లాడుతున్న డీసీఎంఎస్ చైర్‌పర్సన్ డాక్టర్ అవనాపు భావన

విజయనగరం: దంత సంరక్షణతో ఆరోగ్యాన్ని మెరుగుపర్చుకోవచ్చని విజయనగరం జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ చైర్‌పర్సన్ డాక్టర్ అవనాపు భావన అన్నారు. ఎస్‌బీఐ కాలనీలో బాలాజీ వాకర్స్ క్లబ్ నెలవారీ సమావేశంలో భాగంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, నడక ఆరోగ్యాన్నిస్తుందన్నారు. శరీరంలో ఉన్న అన్ని అవయవాల వలే దంత సంరక్షణకు కూడా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు రామరాజు, కార్యదర్శి నాగలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలపై అవగాహన



నార్త్‌జోన్ మండల పార్టీ ప్రతినిధులతో మాట్లాడుతున్న కుసుమంచి సుబ్బారావు, తదితరులు

విజయనగరం టౌన్: భారతీయ జనతా పార్టీ ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లి, వారికి పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాలని బీజేపీ సీనియర్ నాయకులు కుసుమంచి సుబ్బారావు, దుక్కా ఆదినారాయణ పిలుపునిచ్చారు. గురువారం స్థానిక పార్టీ కార్యాలయంలో బీజేపీ నార్త్ జోన్ మండల కమిటీని 24 మందితో నియమించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ప్రధాని ప్రవేశపెట్టిన జల్‌జీవన్ మిషన్, ఉచిత గ్యాస్ కనెక్షన్లు, విశ్వకర్మ కౌశల్య యోజన పథకం, ఆయుష్మాన్‌భవ, శ్రామికుల ఈశ్రమ్ కార్డ్, తదితర వాటిపై వివరించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. నార్త్ జోన్ అధ్యక్షుడు సుధీర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కమిటీ ప్రతినిధులు కరణం కొండలరావు, ఇమంది అమ్మాజీ, రాజ్‌కుమార్, రాంబాబు, నానాజీ, తదితరులు పాల్గొన్నారు.

అవయవదానానికి ముందుకు రండి



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ పద్మలీల

విజయనగరం ఫోర్ట్: అవయవదానంతో మరొకరికి పునర్జన్మ ఇవ్వడం గొప్ప విషయమని ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె. పద్మలీల అన్నారు. ప్రభుత్వ వైద్య కళాశాలలో అవయవదానంపై గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఒకరు అవయవ దానం చేయడం వల్ల ఎనిమిది మందికి జీవితాన్ని ఇవ్వొచ్చన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సునీత, ప్రొఫెసర్లు డాక్టర్ అన్నపూర్ణ, డాక్టర్ శివకుమార్, డాక్టర్ శరత్‌కుమార్, డాక్టర్ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

అన్నదానం



స్వామి ప్రసాదాన్ని వడ్డిస్తున్న ఎంపీపీ బంటుపల్లి వాసుదేవరావు, తదితరులు

డెంకాడ: మండలంలోని చింతలవలస ఐదో ఏపీఎస్పీ బెటాలియన్‌లో వినాయ ఉత్సవాల్లో భాగంగా గురువారం అన్నసమారాధన నిర్వహించారు. ఎంపీపీ బంటుపల్లి వాసుదేవరావు భక్తులకు ప్రసాదం వడ్డించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. సుమారు నాలుగు వేల మంది స్వామి ప్రసాదం స్వీకరించారు. కార్యక్రమంలో బెటాలియన్ పోలీస్ అధికారుల సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోరాడ రామునాయుడు, 5వ ఏపీఎస్పీ బెటాలియన్ ఉద్యోగుల సంఘ నాయకుడు మిత్తిరెడ్డి అప్పలనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

ప్రాణహాని ఉంది.. కాపాడండి...

నెల్లిమర్ల రూరల్: మండలంలోని పెద తరిమి గ్రామానికి చెందిన పలువురు దళితులు టీడీపీ నేతల నుంచి తమకు రక్షణ కల్పించాలంటూ స్థానిక పోలీస్ స్టేషన్‌లో గురువారం ఫిర్యాదు చేశారు. గ్రామానికి చెందిన దేబార్కి అప్పలస్వామి, మామిడి సూర్యనారాయణ, అప్పలరాములు, తదితర పది మంది రైతులు ఎస్సై నారాయణరావును కలిసి తమ గోడు వెల్లబోసుకున్నారు. బొడ్డపేటకు చెందిన టీడీపీ నేతలు సువ్వాడ రవిశేఖర్, కడగల ఆనంద్‌కుమార్‌తో పాటు తరిమి గ్రామానికి చెందిన దేబార్కి రాము, సూరయ్య, రామకృష్ణ, గురుమూర్తి, అప్పలరాజు, తదితర 20 మంది తాము ఎన్నో ఏళ్లగా సాగు చేసుకుంటున్న భూములపైకి వస్తూ దౌర్జన్యానికి దిగుతున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. వాళ్లతో తమకు ప్రాణహాని ఉందని, రక్షణ కల్పించాలని కోరారు.

అన్ని ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలు



7వ డివిజన్‌లో నూతనంగా నిర్మించిన రోడ్డును ప్రారంభిస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, నగర మేయర్, స్థానిక కార్పొరేటర్లు

- డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి
- 7వ డివిజన్‌లో రూ.33.50 లక్షలతో అభివృద్ధి పనులు ప్రారంభం

విజయనగరం: మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని అన్ని ప్రాంతాల్లో సంపూర్ణ మౌలిక సదుపాయాల కల్పనే ధ్యేయంగా అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. ప్రాధాన్యతాక్రమంలో ఆయా ప్రాంతాల్లోని సమస్యలు పరిష్కరిస్తున్నట్లు చెప్పారు. నగరంలోని 7వ డివిజన్‌లో రూ.33.50 లక్షలతో నూతనంగా నిర్మించిన సీసీ రోడ్లను డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, నగర మేయర్ వెంపడాపు విజయలక్ష్మి గురువారం ప్రారంభించారు. డివిజన్ పరిధిలో గల సుద్ద వీధి, యాతవీధి, గొల్ల వీధులలో గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో పర్యటించిన సందర్భంలో స్థానికుల వినతి మేరకు సీసీ రోడ్ల ఏర్పాటుకు డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి హామీ ఇచ్చారు. ఈ మేరకు పూర్తయిన రోడ్లను ప్రారంభించి ప్రజా వినియోగంలోకి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా 7వ డివిజన్ కార్పొరేటర్ పొంతపల్లి మాలతి, జోనల్ ఇన్‌చార్జ్ బోడసింగి ఈశ్వరరావు మాట్లాడుతూ, తమ డివిజన్ పరిధిలో డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అనేక అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టారన్నారు. ముఖ్యంగా తాగునీటికి ఇబ్బందుల్లేకుండా వాటర్ ట్యాంకుల నిర్మాణాన్ని చేపట్టి కుళాయి కనెక్షన్లు మంజూరు చేశారని చెప్పారు. రహదారులు, కాలువలను ఏర్పాటు చేసి ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించారని తెలిపారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సంక్షేమ పాలన సాగిస్తుంటే, స్థానికంగా డిప్యూటీ స్పీకర్ల వీరభద్రస్వామి అభివృద్ధి పనులు చేపడుతూ ఆదర్శంగా నిలుస్తున్నారన్నారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ప్రజా సమస్యలను పట్టించుకునే వారే కరువయ్యారని విమర్శించారు. కార్యక్రమంలో నగర మేయర్ వెంపడాపు విజయలక్ష్మి, వైఎస్సార్‌సీపీ జోనల్ ఇన్‌చార్జి బొద్దాన అప్పారావు, పార్టీ నాయకులు పొంతపల్లి గోపి, చిట్టి రాజు, తదితరులు పాల్గొన్నారు.

పైడితల్లి జాతరలోగా రోడ్లు పూర్తి..



అంబేడ్కర్ జంక్షన్ నుంచి గంటస్తంభం జంక్షన్ వరకు వేసిన రోడ్డును పరిశీలిస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

- వచ్చే నెల 2 నుంచి ప్రత్యేక పారిశుధ్య పనులు
- డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

విజయనగరం: ఉత్తరాంధ్రుల ప్రజల ఆరాధ్య దైవం, విజయనగరం ప్రజల ఇలవేల్పు పైడితల్లి జాతర సమయానికల్లా వీలైనన్ని రహదారులను పూర్తి చేస్తామని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. అంబేడ్కర్ జంక్షన్ నుంచి గంటస్తంభం వరకు వేసిన బీటీ రహదారులను గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, నగరంలో ప్రధాన రహదారులను అభివృద్ధి చేయడంతో పాటు కొత్త రోడ్లు వేస్తున్నామన్నారు. మయూరి జంక్షన్ నుంచి అంబేడ్కర్ జంక్షన్ వరకు.. అలాగే ఎస్‌బీఐ మెయిన్ బ్రాంచ్ నుంచి రామానాయుడు రహదారి, గణేష్ కోవెల నుంచి ఎస్‌బీటీ మార్కెట్ వరకు, అంబేడ్కర్ జంక్షన్ నుంచి గంటస్తంభం వరకు, ఆర్అండ్‌బీ జంక్షన్ నుంచి పాల్‌నగర్ వరకు ప్రధాన రహదారులు ఏర్పాటు చేస్తున్నామన్నారు. అదేవిధంగా ట్యాంక్‌బండ్ రోడ్‌లో ఉన్న పెద్ద చెరువు గట్టును సుందరంగా తీర్చిదిద్దుతున్నామని చెప్పారు. మున్సిపాలిటీ నుంచి కార్పొరేషన్ స్థాయికి ఎదిగిన నగరానికి అందుకు తగ్గట్లుగా సుందరీకరణ పనులను చేపడుతున్నామన్నారు. ఇప్పటికే ప్రధాన జంక్షన్లను అభివృద్ధి చేశామని, మరికొన్ని జంక్షన్‌లను అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. అక్టోబర్ 2 గాంధీ జయంతి నుంచి నగరంలో ప్రత్యేక పారిశుధ్య పనులు చేపడతామని చెప్పారు. కార్యక్రమంలో నగర మేయర్ వెంపడాపు విజయలక్ష్మి, విజయనగరం కార్పొరేషన్ డీఈలు, ఏఈలు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజల సంతోషమే ప్రభుత్వ లక్ష్యం



లబ్ధిదారులతో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

- వైఎస్సార్‌సీపీ జోనల్ ఇన్‌చార్జ్ కోలగట్ల తమన్నశెట్టి

విజయనగరం: ప్రజల సంతోషమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని వైఎస్సార్‌సీపీ జోనల్ ఇన్‌చార్జ్ కోలగట్ల తమన్నశెట్టి అన్నారు. గురువారం సాయంత్రం నగరంలోని 41వ డివిజన్‌లోని 49వ సచివాలయం పరిధిలో గల కంటోన్మెంట్ తెలకల వీధి, సంజీవ్‌నగర్ కాలనీ, గొల్లవీధి ప్రాంతాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తమ్మన్నశెట్టి, తదితరులు ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలపై ఆరా తీశారు. వైఎస్సార్‌సీపీ హయాంలో ఒక్కో ఇంటికి కలిగిన లబ్ధిని వివరిస్తూ ముఖ్యమంత్రి సందేశంతో కూడిన బుక్‌లెట్లను పంపిణీ చేశారు. అనంతరం తమ్మన్నశెట్టి మాట్లాడుతూ, ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల తీరును తెలుసుకోవడంతో పాటు స్థానిక సమస్యలను గుర్తించి పరిష్కరించడానికే ప్రభుత్వం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తోందన్నారు. పాలనపై ప్రజలందరూ సంతోషం వ్యక్తం చేయడం అభినందనీయమన్నారు. స్థానిక కార్పొరేటర్ ఎస్.నారాయణస్వామి మాట్లాడుతూ, తమ డివిజన్ అభివృద్ధికి డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అందిస్తున్న సహాయ, సహకారాలు మరువలేనివని తెలిపారు. డివిజన్ పరిధిలోని పార్కును అభివృద్ధి చేశారని.. రూ. 20 లక్షలతో కబరిస్తాన్ ప్రాంతంలో ప్రహరీ నిర్మించారన్నారు. కార్యక్రమంలో కో ఆప్షన్ సభ్యులు రహీం, జోనల్ ఇన్‌చార్జ్ దూబే, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వయోవృద్ధుల సూచనలు పాటించాలి

విజయనగరం టౌన్: వయోవృద్ధుల సూచనలు యువత పాటించి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆంధ్రాబ్యాంక్ రిటైర్డ్ ఉద్యోగి భోగరాజు బాబూజీ అన్నారు. గురువారం స్థానిక ఫూల్‌బాగ్ రోడ్డులో ఉన్న కుసుమ హరనాథ క్షేత్రంలో ఉన్న వాసవీ వృద్ధాశ్రమంలో ఉన్న వృద్ధులకు భోజనం, పండ్లు, స్వీట్లు పంపిణీ చేశారు. అనంతరం వృద్ధాశ్రమ నిర్వాహకుడు దాలయ్యశెట్టిని సత్కరించారు. కార్యక్రమంలో మూలా భాస్కరరావు, బుర్రా జగన్నాథరావు, సత్యమూర్తి, కామేశ్వరరావు, సత్యమూర్తి, పీవీ నరసింహారావు, శారద, కళ్యాణి, రమాదేవి, తదితరులు పాల్గొన్నారు.

వాహనాల వేలం రేపు

విజయనగరం క్రైమ్: వివిధ కేసుల్లో స్వాధీనం చేసుకున్న రెండు వాహనాలను శనివారం వేలం వేయనున్నట్లు ఎస్ఈబీ సీఐ మధుకుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆ రోజు ఉదయం పది గంటలకు బొగ్గులదిబ్బ వద్ద నున్న ఎస్ఈబీ కార్యాలయం ఆవరణలో వేలం వేయనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తిగల వారు నేరుగా పాల్గొనాలని కోరారు.

జీపీఎస్ బిల్లు రద్దు చేయాలి

విజయనగరం అర్బన్: ప్రభుత్వం తాజాగా ఆమోదించిన ఉద్యోగ, ఉపాధ్యాయుల జీపీఎస్ బిల్లును రద్దు చేయాలని ఏపీటీఎఫ్ డిమాండ్ చేసింది. ఈ మేరకు జిల్లా కమిటీ సభ్యులు గురువారం స్థానిక కోట జంక్షన్‌లో నల్ల రిబ్బన్లతో నిరసన చేపట్టారు. కమిటీ జిల్లా అధ్యక్షుడు డి.ఈశ్వరరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి ఎన్‌వీ పైడిరాజు, వై.మధుసూదనరావు, అదనపు కార్యదర్శి ఏవీ శ్రీనివాసరావు, జిల్లా కార్యదర్శులు వి.అప్పలరాజు, దామోదరనాయుడు, సీహెచ్ పైడితల్లి, వెంకటరమణ, ఎస్.కూర్మారావు, కె.మధుసూధనరావు, ఈశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

అవగాహన ఒప్పందం



ఒప్పంద పత్రంతో అకాడమీ, కళాశాల ప్రతినిధులు

విజయనగరం అర్బన్: సీఎస్‌సీ అకాడమీ ఆఫ్ మెయిట్ (మినిస్ట్రీ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ) భారత ప్రభుత్వ సంస్థతో సీతం ఇంజినీరింగ్ కళాశాల అవగాహన ఒప్పందం చేసుకుందని సీతం విద్యాసంస్థల డైరెక్టర్ డాక్టర్ ఎం.శశిభూషణరావు అన్నారు. ఈ మేరకు గురువారం కళాశాల ప్రాంగణంలో జరిగిన కార్యక్రమంలో ఒప్పందంపై సీఎస్‌సీ అకాడమీ ప్రతినిధులు సంతకం చేశారు. ఈ సందర్భంగా శశిభూషణరావు మాట్లాడుతూ, ఒప్పందంలో భాగంగా విద్యార్థులు, అధ్యాపకులకు నైపుణ్యాభివృద్ధిపై శిక్షణ ఇస్తారన్నారు. కార్యక్రమంలో సీఎస్‌సీ అకాడమీ ప్రతినిధి వీఎల్ఈవై రామ్మోహనరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ డీవీ రామమూర్తి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ టీడీ వీఏ నాయుడు, సీఎస్‌సీ అకాడమీ ఆపరేషన్స్ ఎగ్జిక్యూటివ్ పి.సౌజన్య పాల్గొన్నారు.

చీపురు చేతబట్టిన నగర పంచాయతీ కమిషనర్



పారిశుధ్య పనుల్లో పాల్గొన్న కమిషనర్ బాలాజీప్రసాద్

నెల్లిమర్ల: నెల్లిమర్ల నగర పంచాయతీ కమిషనర్ పి.బాలాజీ ప్రసాద్ స్వయంగా చీపురు చేతబట్టి పారిశుధ్య పనుల్లో పాల్గొన్నారు. ఈ మేరకు నెల్లిమర్ల పట్టణంలోని ప్రధాన రహదారిలో గురువారం నిర్వహించిన పారిశుధ్య కార్యక్రమంలో భాగంగా ఆయనే చెత్త ఎత్తారు.గడ్డపారతో మురుగునీటి కాలువలో పూడిక తొలగించారు.స్వచ్ఛత సేవా కార్యక్రమాల్లో భాగంగా పట్టణంలో పారిశుధ్య నిర్వహణకు స్థానికులు సహకరించాలని కమిషనర్ కోరారు.కార్యక్రమంలో సిబ్బంది మధు, వాసు తదితరులు పాల్గొన్నారు.

జెడ్పీ చైర్మన్‌కు సత్కారం



జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావును సన్మానిస్తున్న భోగాపురం మండలానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు

భోగాపురం: ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను నేరుగా ప్రజలకు అందజేయడంతో పాటు జిల్లాను అన్నిరంగాల్లో అభివృద్ధి పథంలో నడిపిస్తున్న జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావును వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఉప్పాడ సూర్యనారాయణరెడ్డి, తదితరులు గురువారం ఘనంగా సత్కరించారు. జెడ్పీ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టి రెండేళ్లు పూర్తయిన సందర్భంగా శ్రీనివాసరావును సత్కరించినట్లు సూర్యనారాయణరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు దంతులూరి రావాడబాబు, మైలపిల్లి నరసింహులు, పూడిక నూకరాజు, కర్రోతు వెంకటరమణ, బైరెడ్డి రమణ, పడాల శ్రీనివాసరావు, సుందరహరీష్, వాసుపల్లి రేయ్యుడు, పతివాడ రామకృష్ణ, పోతిరెండి గోపి, డీబీ రెడ్డి, కొయ్య బంగార్రాజు, శీరపు గురునాథ్‌రెడ్డి, పిగుడు రాంబాబు, ఊడికల గురువులు, రాయి ఈశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

డ్రామా జూనియర్స్ టాప్ టెన్‌లో హేమలత



హేమలతను అభినందిస్తున్న అకాడమీ డైరెక్టర్ మున్నా మైఖేల్, తదితరులు

విజయనగరం టౌన్: మున్నా డ్యాన్స్ అకాడమీకి చెందిన విద్యార్థిని ఎనిమిదేళ్ల పి.హేమలత జీ తెలుగు చానల్ నిర్వహిస్తున్న డ్రామా జూనియర్స్ సీజన్–6లో టాప్‌టెన్‌లో నిలిచిందని అకాడమీ నిర్వాహకుడు మున్నా మైఖేల్ తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన ప్రకటన విడుదల చేశారు. పట్టణంలో జమ్ము ఆనందపురం కాలనీకి చెందిన హేమలత జూనియర్ డ్రామా సీజన్ ఆడిషన్‌లో 800 మందితో పోటీపడి టాప్‌టెన్‌లో నిలిచిందన్నారు. ఈ మేరకు చిన్నారి తల్లిదండ్రులు పద్మజ, రవిచంద్రరావులతో పాటు బంధువులు, అభిమానులు, జిల్లా వాసులు హర్షం వ్యక్తం చేశారు.

జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలను విజయవంతం చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ అప్పలరాజు

విజయనగరం ఫోర్ట్: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా ఈ నెల 30వ తేదీ నుంచి నిర్వహించనున్న వైద్య శిబిరాలను విజయవంతం చేయాలని డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ జిల్లా కోఆర్డినేటర్ అప్పలరాజు కోరారు. గురువారం స్థానిక ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో ప్రైవేట్ ఆస్పత్రుల వైద్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వైద్య శిబిరాల్లో ప్రైవేట్ ఆస్పత్రుల వైద్యులు కూడా పాల్గొని వైద్య సేవలు అందించాలన్నారు. జిల్లా వ్యాప్తంగా 500 శిబిరాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. ప్రతి శిబిరంలో ఇద్దరు ఎంబీబీఎస్ వైద్యులు, ఇద్దరు స్పెషలిస్టు వైద్యులు పాల్గొంటారన్నారు. సమావేశంలో భాను, ముత్యాలనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

భగత్‌సింగ్ ఆశయ సాధనకు ఉద్యమించాలి



భగత్‌సింగ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఏఐవైఎఫ్ నాయకులు



నెల్లిమర్ల: భగత్‌సింగ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న వామపక్షాల నాయకులు

- ఏఐవైఎఫ్ జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి బుగత అశోక్

విజయనగరం ఫూల్‌బాగ్: భగతసింగ్ ఆలోచనలు పుణికిపుచ్చుకుని, ఆయన ఆశయ సాధనకు యువత ఉద్యమించాలని ఏఐవైఎఫ్ జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి బుగత అశోక్ పిలుపునిచ్చారు. గురువారం స్థానిక డీఎన్ఆర్ భవన్‌లో ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు బూర వాసు ఆధ్వర్యంలో భగత్‌సింగ్ 116వ జయంతి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం అశోక్ మాట్లాడుతూ, భగత్‌సింగ్ చిన్న వయసులోనే దేశం కోసం ప్రాణాలర్పించారని కొనియాడారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ మాజీ నాయకులు అప్పరుబోతు జగన్నాథం, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి బాలి గౌరినాయుడు, ఏఐవైఎఫ్ నాయకుడు జల్లేపల్లి సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

పోరాటం చేయాలి

నెల్లిమర్ల: భగత్‌సింగ్ స్ఫూర్తితో కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై పోరాటం చేయాలని వామపక్షాల నేతలు పిలుపునిచ్చారు. స్థానిక అమరవీరుల స్మారక భవనంలో భగత్‌సింగ్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వామపక్ష నాయకులు కిల్లంపల్లి రామారావు, తాలాడ సన్నిబాబు, మొయిద పాపారావు, కాళ్ల అప్పలసూరి, తదితరులు పాల్గొన్నారు.

పరిశోధనలపై అవగాహన



పరిశోధనలపై అవగాహన కల్పిస్తున్న మెకానికల్ విభాగాధిపతి దీపక్

నెల్లిమర్ల రూరల్: విద్యార్థులు పరిశోధనలపై అవగాహన పెంచుకోవాలని మెకానికల్ విభాగాధిపతి ఎస్వీఎస్‌కే దీపక్ సూచించారు. మండలంలోని సెంచూరియన్ యూనివర్సిటీలో పరిశోధనాపత్రం తయారీపై గురువారం సెమినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యూజీసీ, ఏఐసీటీఈ వంటి జాతీయ సంస్థలు కేవలం స్కోపస్, యూజీసీ, డబ్ల్యూఓఎస్‌లో ప్రచురితమైన పత్రాలను మాత్రమే గుర్తిస్తాయన్నారు. పరిశోధనల్లో వచ్చిన ఫలితాలను గ్రాఫ్‌లు, బొమ్మలతో వివరించాల్సి ఉందని సూచించారు. కార్యక్రమంలో ఐక్యూసీఏసీ డీన్ ప్రొఫెసర్ పీఎస్వీ రమణారావు, డీన్‌లు ఆచార్యులు, సన్నీడియోల్, బెనర్జీ, తదితరులు పాల్గొన్నారు.

ఎంఎస్ స్వామినాథన్ మృతి తీరనిలోటు

విజయనగరం ఫూల్‌బాగ్: హరిత విప్లవ పితామహుడు, ప్రముఖ వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ ఎంఎస్ స్వామినాథన్ రైతులకు తీరని లోటని ఏపీ రైతు సంఘ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బి. రాంబాబు, ఎస్.గోపాలం తెలిపారు. గురువారం వారు మాట్లాడుతూ, భారతదేశంలో ఆహారధాన్యాల లోటు నుంచి మిగులులోకి తీసుకురావడంలో స్వామినాథన్ ప్రధాన భూమిక పోషించారన్నారు. పంటలలో హైబ్రిడ్ వంగడాలు రూపొందించి, దిగుబడులు పెరిగేలా చేశారని తెలిపారు.

ఘన నివాళి..

విజయనగరం అర్బన్: దేశం గర్వించదగ్గ మహా మనిషి ఎంఎస్ స్వామినాథన్ కన్ను మూయడం విచారకరమని మాజీ ఎంపీ డాక్టర్ డీవీజీ శంకరరావు ఒక ప్రకటనలో తెలిపారు. వ్యవసాయ రంగానికి, ఆహార భద్రతకు, దేశ స్వావలంబనకు ఆయన చేసిన కృషి వెలకట్టలేనిదని పేర్కొన్నారు. వ్యవసాయ కమిషన్ చైర్మన్‌గా ఆయన చేసిన సిఫార్సుల వల్ల పాలకులు రైతుకు న్యాయం చేసే పలు సంస్కరణలు తీసుకొచ్చారన్నారు.

1632 మద్యం బాటిల్స్ ధ్వంసం

చీపురుపల్లి: ఎస్పీ ఎం.దీపిక ఆదేశాల మేరకు 1632 మద్యం బాటిల్స్‌ను ధ్వంసం చేసినట్లు ఎస్సై ఎ.సన్యాశినాయుడు తెలిపారు. ఈ మేరకు గురువారం స్థానిక పోలీస్‌స్టేషన్ ఆవరణలో మద్యం బాటిల్స్ ధ్వంసం చేశారు.